ప్రజాశక్తి
సోమవారం 24 ఏప్రిల్ 2023
5
కర్నూలు





ప్రచారభేరిలో మాట్లాడుతున్న పి.ఎస్.రాధాకృష్ణ

యువగళంలో ..
వినతుల వెల్లువ

- ఆదోనిలో లోకేష్ యువగళం



యువకులకు అభివాదం తెలుపుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-ఆదోని/ఆదోని రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళంలో అడుగడుగునా ప్రజలు, పలు సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను విన్నవిస్తున్నారు. యువగళం పాదయాత్ర ఆదివారం ఆదోని నియోజకవర్గంలో సాగింది. కడితోట క్యాంప్ శిబిరం నుంచి ప్రారంభమైన యాత్ర గనేకల్ క్రాస్, జాలమంచి, పాండవగల్, బలేకల్ క్రాస్, కుప్పగల్ మీదుగా పెద్ద తుంబలం క్రాస్ వరకూ సాగింది. గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, పది రోజులకు ఒకసారి తాగునీరు వస్తోందని గణేకల్లు గ్రామస్తులు లోకేష్‌ను కలిసి విన్నవించారు. జాలమంచి గ్రామస్తులు లోకేష్‌ను కలిసి పలు సమస్యలు విన్నవించారు. తాగునీటి సమస్య ఉందని, పొలాలకు తుంగభద్ర, ఎల్ఎల్‌సి నుంచి ఎత్తిపోతల ద్వారా సాగునీటిని అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. తాగు, సాగునీటి సమస్య లేకుండా చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. గణేకల్లు శివారులో సజ్జచేలో దిగి రైతు గోళ్ల నాగరాజు కష్టాలను లోకేష్ తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం డిడి కట్టి ఏడాది అయినా ఇంకా రాలేదని రైతు తెలిపారు. కడితోట శివారులో దూదేకుల ఇస్మాయిల్ అనే వికలాంగుడు లోకేష్‌ను కలిశారు. తనకు 3 ఎకరాల పొలం ఉంటే 30 ఎకరాలు ఉన్నట్లు రికార్డుల్లో చూసి పెన్షన్ తీసేసారని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వైసిపి ప్రభుత్వం అక్రమంగా తొలగించిన పెన్షన్లన్నీ పునరుద్ధరిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. కుప్పగల్ మధ్యాహ్న విరామ శిబిరం వద్ద బిసి సామాజికవర్గ ప్రతినిధులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. టిడిపి అధికారంలోకి రాగానే బిసిలకు స్వర్ణయుగం తెస్తామని లోకేష్ తెలిపారు. వాల్మీకులను వైసిపి మోసం చేసిందని, వారు ఏ కులంలో ఉన్నా ఆదుకోవడానికి రాయితీ రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. టిడిపి అధికారంలోకి రాగానే రజకులకు వాషింగ్ మెషిన్‌తో పాటు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. రాయలసీమ దాటేలోపు సీమ అభివృద్ధిపై బ్లూప్రింట్ విడుదల చేస్తానన్నారు. కుప్పగల్లులో న్యాయవాదులతో లోకేష్ భేటీ అయ్యారు. పెద్ద తుంబలంలో లోకేష్‌కు టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ముస్లిం విద్యార్థులకు ఉర్దూ పాఠశాల, జూనియర్ కళాశాల లేవని పెద్ద తుంబలం గ్రామస్తులు లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. అలకనూమ ప్రాజెక్టు నుంచి పొలాలకు తాము ఏర్పాటు చేయాలని, పెద్ద తుంబలాన్ని మండలకేంద్రంగా చేయాలని కోరారు. పెద్దతుంబలం విడిది కేంద్రంలో లోకేష్ బస చేశారు. ఆదివారం మొత్తంగా 15.2 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది. యాత్రలో మాజీ ఎమ్మెల్యే బిటి నాయుడు, ఆదోని నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి మీనాక్షి నాయుడు, మాజీ ఇంఛార్జి గుడిసె కృష్ణమ్మ పాల్గొన్నారు.

కొండలు, గుట్టలను కనపడనీయవా క్యాష్ ప్రసాదూ?

యువగళం పాదయాత్రలో లోకేష్ నడుస్తూ ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్‌తో సెల్ఫీ దిగారు. మూడు రోజులుగా ఎమ్మెల్యే క్యాష్ ప్రసాద్ చిట్టా తను బయట పడుతుంటే ఆయనేమో బూతుల పంచాంగం వినిపిస్తున్నారని లోకేష్ తెలిపారు. ఎర్రగట్టుకొండను తవ్వేసి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని, రోజూ 50 టిప్పర్ల ఎర్రమట్టిని టిప్పర్ రూ.5వేల చొప్పున అమ్మేసుకుంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో కొండలను, గుట్టలను కనిపించకుండా చేస్తానని జగన్ రెడ్డి వద్ద శపథం చేశావా క్యాష్ ప్రసాదా? అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.



బిసిలతో ముఖాముఖిలో మాట్లాడుతున్న నారా లోకేష్

మోడీ గద్దె దిగేంత వరకు విశ్రమించం

ప్రచార భేరిలో సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కేంద్రంలోని నరేంద్ర మోడీని గద్దెదించే వరకు విశ్రమించేది లేదని సిపిఎం, సిపిఐ నాయకులు అన్నారు. ఆదివారం ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా ముజఫర్ నగర్, సుందరయ్య నగర్, గంగావతి నగర్ గోవర్ధన్ నగర్‌లో ప్రచారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ, నగర కార్యదర్శి టి.రాముడు, సిపిఐ నగర నాయకులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. దేశంలో మతోన్మాదం పెరిగి దేశం పరిస్థితి వెనక్కి నెట్టే విధంగా నరేంద్ర మోడీ పాలన సాగిందన్నారు. ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు వేస్తూ బడా పెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తూ పేద ప్రజలను మరింత పేదలుగా చేస్తున్నారని అన్నారు. ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్ముతున్నారని తెలిపారు. అందుకోసం నరేంద్ర మోడీని గద్దె దింపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలను కోరారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నేనేమీ తక్కువ కాదంటూ నరేంద్ర మోడీ చెప్పిన విధంగా చేస్తూ విద్యుత్ సవరణ చట్టం పేరుతో రైతుల మోటార్లకు మీటర్లు పెట్టి విద్యుత్ భారం మోపుతున్నారన్నారు. నూతన విద్యా విధానం పేరుతో పేదవారికి విద్యను దూరం చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి రావలసిన హక్కులను ప్రశ్నించడం లేదా పూర్తిగా విఫలం చెందారని అన్నారు. కర్నూలు నగరంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలన్నారు. పందిపాడు ఇందిరమ్మ ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించి రూ. ఐదు లక్షల రుణం ఇవ్వాలని, గోవర్ధన్ నగర్‌లో రైతు బజార్ వెంటనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రచార భేరి కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.సాయిబాబా, కె.సుధాకరప్ప, మహిళా సంఘం నాయకులు ఓబులమ్మ, శారదమ్మ, రమణమ్మ, నాగేశ్వరి, ఆటో యూనియన్ నాయకులు ప్రభాకర్ అయ్యస్వామి, మాలిక్, సిపిఐ నాయకులు ఎంసి. ఆనంద్, విజయ్ దేశముర్, దావీదు, ముక్తియార్ జె.శ్రీనివాసులు, సురేష్, చిన్న వెంకటరమణ, దావీదు, ముని, హమాలీలు, ప్రజలు పాల్గొన్నారు.

తండ్రీ, కొడుకుల పర్యటనతో
శాంతి భద్రతలకు విఘాతం

- దళితులపై దాడి సిగ్గుచేటు - కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బివై.రామయ్య, కాటసాని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, బివై రామయ్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రతిపక్ష నేత చంద్రబాబు తనయుడు లోకేష్ పర్యటనలలో చేసే వికృత చేష్టలు రాష్ట్రంలో పదేపదే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయని వైసిపి జిల్లా అధ్యక్షుడు, కర్నూలు మేయర్ బివై. రామయ్య, నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో చంద్రబాబు పర్యటన సందర్భంగా, దళితులపై కర్నూలు జిల్లాలో టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దళిత నిరసనకారు లు చేపట్టిన ఆందోళనపై చంద్రబాబు టిడిపి అల్లరిమూకలను రెచ్చగొట్టి వారి మీద చేయించిన దాడులను బివై. రామయ్య, కాటసాని ఖండించారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భం గా బివై.రామయ్య మాట్లాడుతూ మీడియాను తనవైపు తిప్పుకునేందుకు ఉద్దేశపూర్వకంగా టిడిపి అల్లరిమూకలను రెచ్చగొట్టి శునకానందం పొందుతు న్నారని అన్నారు. అధికారం కోసం ఎంతకైనా తెగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యఅన్నారు. కర్నూలుకు చంద్రబాబు వచ్చినప్పుడు కూడా న్యాయ రాజధానికి మద్దతు ఇవ్వండని కోరిన ఉద్యమ కారులపై, దాడులు చేసేలా టిడిపి గుండాలను చంద్రబాబు బహిరంగ సభలో రెచ్చగొట్టారని, మార్గమధ్యలో కొందరికి గాయాలు కూడా అయ్యేలా బాబు వ్యవహరించారన్నారు. నారా లోకేష్ పాదయాత్ర అర్థరహితమని, కేవలం ఎమ్మెల్యేల మీద తప్పుడు ఆరోపణలు చేసి తన గురించి చర్చ జరగాలనే ఉద్దేశం తప్ప మరేమీ కనబడటం లేదన్నారు. జనం లేకుండా 1000 కిలోమీటర్ల పాదయాత్ర జరిగితే కనీసం 1000 కిలోమీటర్లలో తాను ఏమేం తెలుసుకున్నాడో చెప్పలేని మూర్ఖుడు లోకేష్ అన్నారు. ప్రజల మధ్య కుల, మత, వర్గాలుగా విభజించి రెచ్చగొట్టి లబ్ది పొందాలని టిడిపి ప్రయత్నిస్తుందని, ఇదంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు, లోకేష్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఓ ప్రైవేట్ సంస్థ సర్వేలో 24 ఎంపీ సీట్లు వైసిపికి వస్తాయని చెబుతుండటంతో టిడిపి నేతలకు నిద్రపట్టడం లేదన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం కోసం ఉద్దేశపూర్వకంగా చంద్రబాబు రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దళితులను రోడ్డు పక్కకు లాకెళ్లి మరీ దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. మంత్రి కార్యాలయం వద్ద ఆగి టిడిపి మూకలను రెచ్చగొట్టి దాడులకు ఉసిగొల్పడం నీచ రాజకీయాలకు నిదర్శనం అన్నారు. యువగళం పాదయాత్రకు ఒక జెండా పెట్టారు గాని అజెండా పెట్టలేదని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వి మోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా విభాగం జోనల్ ఇంచార్జ్ గాజుల శ్వేతారెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.గోపాల్ రెడ్డి, ఎస్‌సిసెల్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. మద్దయ్య, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి పాల్గొన్నారు.

త్వరలో ఆటోమేటిక్ విధానంలో లైసెన్సులు

- నిబంధనలు పాటించకుంటే చర్యలు
- విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు
- చలానాలు తప్పని సరిగా చెల్లించాలి
- ప్రజాశక్తితో రవాణా శాఖ ఉప కమిషనర్ శ్రీధర్



ప్రజాశక్తి - కర్నూలు క్రైం

త్వరలో ఆటోమేటిక్ విధానంలో వాహన లైసెన్సుల జారీ ప్రక్రియ ప్రారంభం అవుతుందని రవాణా శాఖ ఉప కమిషనర్ (డిటిసి) కె.శ్రీధర్ అన్నారు. జిల్లాలో ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రమాదాలను నివారించడానికి అవసరమైన చర్యలను చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ప్రజల్లో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని, వాటిని అతిక్రమించిన వారిపై చర్యలు చేపడుతూ ప్రమాదాలను నియంత్రించడానికి కషి చేస్తున్నామని ప్రజాశక్తి ఆయనతో నిర్వహించిన ముఖాముఖిలో పేర్కొన్నారు.

డ్రైవింగ్ పరీక్షల విధానంలో మార్పులేమైనా ఉన్నాయా?

డిటిసి : గతంలో వాహనాల డ్రైవింగ్ పరీక్షలను మ్యాన్యువల్ విధానంలో నిర్వహించే వాళ్ళం. త్వరలో డ్రైవింగ్ ఆటోమేషన్ సిస్టం ద్వారా నిర్వహించనున్నాం. వాహనానికి జిపిఎస్ అనుసంధానం ద్వారా వెళ్లిన మార్గంతో పాటు, డ్రైవింగ్ గ్రాఫ్ కూడా ఈ విధానంలో నమోదు అవనుంది. దాని ఆధారంగా ఆన్‌లైన్‌లో ఆటోమేటిక్‌గా డ్రైవింగ్ పరీక్షలో పాస్ లేదా ఫెయిల్ అనేది తేలుతుంది. ఈ పరికరాల బిగింపు ప్రక్రియ పూర్తయింది. దానికి సంబంధించిన డేటా ఎన్ ఐ సి తో లింక్ కావలసి ఉంది. అది పూర్తవగానే నూతన విధానంలో వాహన లైసెన్సులు జారీ చేస్తాం.

జిల్లాలో ఇటీవల వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి కదా? వాటి నివారణ కోసం ఏమైనా చర్యలు చేపడుతున్నారా?

డిటిసి : అవును నిజమే! గతంలో జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. వాటిని దష్టిలో ఉంచుకుని నివారణ కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలను చేపడుతున్నాం. ముఖ్యంగా ప్రతి మూడో శుక్రవారం రోడ్డు భద్రత కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. ఇందులో ప్రధానంగా ఆర్అండ్‌బి, ఎన్‌హెచ్ఎఐ, పోలీసు, పంచాయతీ రాజ్, మున్సిపల్ అధికారుల సమన్వయంతో చర్చించి నిర్ణయాలు చేస్తున్నాం. 20 రకాల అంశాలతో భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. అందులో ప్రధానంగా నేషనల్ హైవేలపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించడం, స్పీడ్ బ్రేకర్లు, హైమాస్క్ లైట్లు ఏర్పాటు, ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు వంటి వాటితో పాటు మరికొన్ని ప్రమాద నివారణ కార్యక్రమాలను చేపడుతున్నాం. రోడ్డు అభివద్ధి పనులు చేపడుతున్నాం. అందులో భాగంగా ఆస్పరి నుంచి కర్నూలు వైపు 30 కిలో మీటర్ల మేరకు రూ.20 లక్షలతో రోడ్డు అభివద్ధి పనులు, ట్రాఫిక్ జంక్షన్‌లలో సమయానుకూలంగా ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ కంట్రోలుకు కషి చేస్తున్నాం. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వైపు నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు నేషనల్ హైవేపై ఉన్న స్పీడు బ్రేకర్లను తొలగింపు, రోడ్డు ఆధునీకరణ పనులు చేపట్టాం. ట్రాఫిక్ ఐల్యాండ్లను గుర్తించాం. అందులో భాగంగా ప్రధానంగా రాజ్ విహార్, బళ్లారి చౌరస్తా, బిర్లా గేటు, మద్దూరు నగర్ జంక్షన్‌ల వద్ద రోడ్ల ఎన్‌క్రోచ్‌మెంట్లు, రోడ్ల క్రమబద్ధీకరణ పనులు చేపడుతున్నాం.

జిల్లాలో ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎంత ఆదాయం వచ్చింది?

డిటిసి : జిల్లాలో గత ఏడాది 18వేల కేసులు నమోదు చేశాం. రూ.17.33 కోట్లు ఫైన్ వేశాం. గత నెలలో 680 కేసులు నమోదు చేశాం. రూ.8 లక్షల జరిమానా విధించాము.

పాఠశాలల బస్సుల భద్రత ఎలా ఉంది?

డిటిసి : జిల్లాలోని పాఠశాలల బస్సులపై విద్యా సంవత్సర ప్రారంభంలో ప్రత్యేక దాడులను నిర్వహించాం. దీంతో వందశాతం బస్సులు ఫిట్ నెస్ ను కలిగి ఉన్నాయి. పాఠశాలల బస్సులన్నీ ప్రమాణాలకు తగినట్లుగా ప్రత్యేక ఏర్పాట్లు కలిగి ఉండాలి.

రవాణా శాఖలో ఫీజులేమైనా పెరిగాయా?

డిటిసి : సాధారణ రవాణా సేవలకు సంబంధించి అన్నీ పాత ఫీజులే ఉన్నాయి. తాజాగా వాహనాల రిజిస్ట్రేషన్ ఫ్యాన్సీ నంబర్ల రిజర్వేషన్ ఛార్జీలు మాత్రం పెరిగాయి. ఈ ఛార్జీలు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఉన్నాయి.





కెవిఆర్ కళాశాలలో అవధానం చేస్తున్న బోరెల్లి హర్ష

ఆకట్టుకున్న బోరెల్లిహర్ష అష్టావధానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భావనా ప్రియ సాహిత్య బృందం ఆధ్వర్యంలో కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు అధ్యయన శాఖ సహకారంతో కర్నూలుకు చెందిన చిరంజీవి బోరెల్లి హర్షతో నిర్వహించిన అష్టావధానం శ్రోతలను ఆకట్టుకుంది. వైద్య విద్యనభ్యసిస్తున్న బోరెల్లి హర్ష 9వ అష్టావదానం అద్వితీయంగా సాగింది. ఈ అవధానానికి సాహితీ ప్రముఖులు శతావధాని డాక్టర్ వారణాసి శివరామకృష్ణ సంచాలకులుగా వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ అవధానం ప్రాముఖ్యతను వివరించారు. అవధానంలో పృచ్ఛకులు అడిగే ప్రశ్నలకు అవధాని సందర్భోచిత సమయస్ఫూర్తి చందోబద్ధమైన పద్యాలు అల్లడంతోనే ఆయన ప్రతిభ తెలుస్తుందన్నారు. వైద్యవిద్యనభ్యసించే బోరెల్లి హర్ష తెలుగు అవధానం చేయడం అభినందనీయమని తెలిపారు. ప్రముఖకవి, రచయిత ఎలమర్తి రమణయ్య–నిషిద్ధాక్షరి, డాక్టర్ ఆదవాని హనుంతప్ప–సమస్య, ఆవుల చక్రపాణి యాదవ్–దత్తపది, అవళూరు సీతమ్మ–న్యస్తాక్షరి, కెవి.సుబ్బ లక్ష్మమ్మ–వర్ణన, దండెబోయిన పార్వతి–ఆశువు, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మీ–యాంత్రికగణనం,ఎండి.ఇనాయతుల్లా–అప్రస్తుత ప్రసంగానికి పృచ్ఛకులుగా వ్యవహరించి ఈ అవధానాన్ని సుసంపన్నం చేశారు. పచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు సందర్భోచితంగా పద్యాలు అల్లి, చివరికి చక్కటి ధారణ చేసన బోరెల్లి హర్షను నిర్వహకులు, పృచ్ఛకులు అభినందించారు. సాహితీవేత్త ఎన్‌సిహెచ్ చక్రవర్తి, భావనాప్రియ వ్యవస్థాపకులు పాలపర్తి హవీలా, కవులు రేవుల శ్రీనివాసులు, మునిస్వామి, జయసుశీల, రాణిలీల పాల్గొన్నారు.

అరాచకాలకు అడ్డు కట్టేది?

చెలరేగుతున్న ఆకతాయి మూక -ఒకే రోజు అదే మూక వేర్వేరు చోట్ల దాడులు
పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. స్టేషన్ పరిధిలో కొంతమంది ఆకతాయిమూకల అరాచకాలు పెట్రేగిపోతున్నాయి. జల్సాలకు అలవాటుపడిన ఈ మూక ఒకేరోజు వ్యవధిలో మూడు చోట్ల వేర్వేరు ఘటనల్లో నలుగురిపై దాడి చేసి గాయపరిచిన ఘటన స్టేషన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకుంది. నిత్యం ఏదో ఒక సంఘటనతో కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ వార్తల్లో నానుతూ ఉంది. ఇదే నేపథ్యంలో ప్రస్తుతం శాంతి భద్రతల విషయంలోనూ తీవ్ర విమర్శలను ఎదుర్కొంటుంది. శనివారం ఓ ఆకతాయి యువకుల ముఠా యూనివర్సిటీ నుండి పసుపుల వైపు వెళ్లే రోడ్డుకు ఎడమ చేతి వైపున ఉన్న బాలాజీ విలాస్ వద్ద ఉన్న ఓ ఇంటి వద్దకు వచ్చి ఇంటిలోని కుటుంబ సభ్యుల పట్ల దురుసుగా వ్యవహరించారు. పొరుగింటిలో ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జగదీశ్వర్ రెడ్డి సదరు ఆకతాయి ముఠాను మర్యాదపూర్వకంగా వారించారు. ఆడపిల్లలు ఉన్న ఇంటి వద్దకు తాగి వచ్చి గొడవ చేయడం మంచిది కాదని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అటు నుంచి వెళ్లిపోయిన ఆ ముఠా మరి కొద్ది సేపటికి అదే కాలనీలో ఉన్న ఓ టీస్టాల్ వద్ద టీ తాగుతున్న జగదీశ్వర్ రెడ్డి వద్దకు బైకులపై వచ్చి మారు మాట్లాడకుండా జగదీశ్వర్‌రెడ్డి పై దాడికి పూనుకున్నారు. పిడిగుద్దుల వర్షం కురిపించారు. అడ్డుకోబోయిన వారినిపై కూడా దాడి చేసేందుకు ప్రయత్నించారు. భయంతో పక్కనున్న ఇంట్లోకి వెళ్లి దాచుకున్న వ్యక్తిని బయటికి బలవంతంగా లాక్కుని వచ్చి దాడి చేశారు. స్థానికంగా టీ స్టాల్‌లో ఉన్న వంట గ్యాస్ సిలిండరును తీసుకొని దాడి చేసే ప్రయత్నం చేశారు. ఈ దాడిలో సుమారు ఆరుగురి దాకా ఉన్నట్లు బాధితుడు పేర్కొన్నారు. ఇదే అల్లరి మూక తాంద్రపాడు వద్ద ఉన్న పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన వాచ్‌మేన్‌ను, అదే కళాశాలకు చెందిన మరికొంతమంది సిబ్బందిపై దాడి చేసి గాయపరిచారు. బి.తాండ్రపాడులో మరో సామాన్యుడిపై కూడా దాడి చేశారు. పది రోజుల క్రితం బి.తాండ్రపాడు చెరువు సమీపంలో మద్యం సేవించిన సుమారు పదిమందితో కూడిన ఓ గ్యాంగ్ రోడ్డుపై అటుగా వెళుతున్న ఓ వ్యక్తిని ఆపి మమ్మల్ని ఎందుకు చూసావురా అంటూ మూకుమ్మడిగా దాడికి చేసి గాయపరిచినట్లు సమాచారం. ఈ ఘటనపై ఇదే స్టేషన్లో కేసు కూడా నమోదు అయినట్లు తెలిసింది. ఇప్పటివరకు ఆ గ్యాంగ్‌ను అరెస్టు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఈ దాడులు చూసి స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీస్ పర్యవేక్షణను పెంచాలని కోరుతున్నారు.



దాడి చేస్తున్న అరాచక మూక

అరాచక శక్తులను అరెస్టు చేయాలి

కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో సామాన్యులపై దాడికి పాల్పడిన అల్లరి మూకను అరెస్ట్ చేయాలి. పోలీస్ స్టేషన్‌కు కూతవేటి దూరంలోనే ఘటన చోటుచేసుకుంది. సాఫ్ట్ వేర్ ఉద్యోగిని, మరో రెండు చోట్ల ఇదే మూక పుల్లారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల వద్ద వాచ్మెన్‌పై, సిబ్బందిపై బి.తాండ్రపాడులో అదే గ్రామానికి చెందిన నాగరాజు అనే మరో వ్యక్తిపై దాడి చేశారు. గంట వ్యవధిలోనే మూడు ఘటనలు చోటు చేసుకోవడం దారుణం. ప్రజల భయభ్రాంతులకు గురి చేస్తున్న సదరుమూకను అరెస్టు చేయాలి.

దాడి చేసిన వారిపై చర్యలు: రామలింగేశ్వర్, సిఐ, తాలుక పోలీస్ స్టేషన్, కర్నూలు

శనివారం బాలాజీ విలాస్ వద్ద జరిగిన దాడి గురించి బాధితలు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేస్తున్నాం. గతంలోనూ తాండ్రపాడులో జరిగిన మరో దాడి సంబంధించి కూడా ఇప్పటికే కేసు నమోదు చేసి విచారిస్తున్నాం. విచారణలో పూర్తి వివరాలను సేకరిస్తాం.



మైపర్ కళాశాలలో ఫేర్వెల్ పార్టీలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

మైపర్ లో ఘనంగా ఫేర్వెల్ పార్టీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని మైపర్ ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ నాలుగో సంవత్సరం విద్యార్థులకు మూడో సంవత్సరం విద్యార్థులు ఫేర్వెల్ పార్టీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, అకాడమిక్ డైరెక్టర్ స్టెల్లా సతీష్ హాజరయ్యారు. ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆశించిన ఆశయాలను , ఉద్యోగ అవకాశాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ జె.రవికుమార్‌రెడ్డి , వైస్ ప్రిన్సిపల్ కె.సురేష్ , అకాడమిక్ డీన్ ఎం.రాజ్ కుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న అనగదత్తా జ్ఞానబోధ సభాట్రస్ట్ నిర్వహకులు

ఉపాధి అవకాశాలతో ఉన్నత స్థాయికి

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

యువత ఉపాధి అవకాశాలతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బివై రామయ్యలు ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని బిర్లా కాంపౌండ్, సాయి వసంత్ కాంప్లెక్స్‌లో అరుణా రెడ్డి, సాయి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో టంబుల్ డ్రైక్లీనర్స్ ను ప్రారంభించారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి, బివై రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక మాట్లాడారు. యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధునాతన పద్ధతులతో దుస్తులు డ్రైక్లీనింగ్ వల్ల దుస్తులకు రక్షణగా ఉండి, అధిక కాలం మన్నికతో ఉంటాయని అన్నారు. ఇలాంటి చిన్న తరహా పరిశ్రమలను అవగాహనాతో కషి చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని వారు తెలిపారు. యజమాని అరుణా రెడ్డి మాట్లాడారు.



డ్రైక్లీనర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్



మాట్లాడుతున్న ఎండి ఇంతియాజ్

మైనార్టీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎండి ఇంతియాజ్

కవులే సమాజ నిర్మాతలు

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్ : కవులే మెరుగైన సమాజాన్ని నిర్మిస్తారనీ, తెలుగు సాహిత్యంలో కవులకు ఉర్దూ సాహిత్యంలో ముసాయిరా కవులకు ప్రాధాన్యత ఉందని ఎపి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎఎండి.ఇంతియాజ్ అన్నారు. ఆదివారం రాత్రి ముసాయిరా, కవి సమ్మేళనం దశాబ్ది నటవైభవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. సభకు లలితకళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య స్వాగతం పలుకుతూ వరుసగా ఉగాది, ఈస్టర్, రంజాన్ పండుగలకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి మతసామరస్యం సమైక్యత కోసం కృషి చేస్తున్నామన్నారు. ముస్లింలు రంజాన్ పండుగను వైభవంగా నిర్వహించుకున్నారని వారికి సంఘీభావం తెలుపడానికి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇనాయతుల్లా, మహమ్మద్ మియా గజల్స్, హిందీ పాటలు కొనసాగాయి. అనంతరం ఇనాయతుల్లా ఆధ్వర్యంలో కవిసమ్మేళనం నిర్వహించారు. చివరిగా 2013 నుంచి ఇప్పటివరకువివిధ అవార్డులు పొందిన సినీ రచయిత బుర్ర సాయి మాధవ్ నిర్వహించిన పద్య నాటక పోటీల్లో పాల్గొన్న కళాకారులు కె. బాల వెంకటేశ్వర్లు, మహమ్మద్ మియా, సామ్యూల్, రాజారత్నం, శ్రీనివాసులు, జివి. శ్రీనివాసరెడ్డి, సంగాఆంజనేయులు, వాల్మీకి రాముడు, ఎస్‌కె. లక్ష్మీ కాంతారావు, పత్తి ఓబులయ్య తోపాటు గాండ్ల లక్ష్మన్నలను సన్మానించారు. కర్నూలు కొత్తపేట ఆంజనేయ స్వామి పూజారి జ్యోతిష్య శాస్త్రవేత్త భాను ప్రకాష్ స్వామీజీని అభినందనలు తెలియజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎఎండి ఇంతియాజ్ కళాకారులను అభినందిస్తూ ప్రతి ఒక్కరిని నగదు బహుమతిని స్వయంగా అందించారు. రాయలసీమలోనే కాక రాష్ట్రమంతటా సంచలనం సృష్టించిన కర్నూలు కళాకారులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అజీజ్ ,పత్తి ఓబులయ్య శేషయ్య తదితరులు హాజరయ్యారు.

సూర్య దేవాలయం వద్ద మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : కర్నూలు సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం అక్షయ తృతీయ సందర్భంగా ఎండలు ఎక్కువగా ఉన్నందున సూర్యనారాయణ స్వామి దేవాలయం దగ్గర గల ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద చల్లని మజ్జిగ పులిహోరను అనగదత్తా జ్ఞాన బోధ సభా ట్రస్ట్ ఆధ్వర్యంలో వాహనదారులకు, ప్రజలకు, పాదచారులకు దాదాపు 1500 మందికి పంపిణీ చేశారని మేనేజింగ్ ట్రస్టీ టి.రామారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రతతో చాలా మంది అస్వస్థతకు గురవుతున్నారని, అలాంటివారికి ఊరట అవ్వడం కోసం మజ్జిగ పంపిణి చేశామన్నారు. సూర్యనారాయణ స్వామి ఆలయం ఆధ్వర్యంలో ట్రస్ట్ ద్వారా పలు సేవకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు వీలైనంత బయట తిరగకుండా ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి హాజరయి ప్రారంభించారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ సి.ఆంజనేయులు, డాక్టర్ సిఎ.నగేష్ వర్మ, బి.ప్రకాష్ సిఎ. రమేష్‌వర్మ, టి.శ్రీదేవి, రమాదేవి, సిఎ. రాజేశ్వరి ,జ్యోతి, శైలజ పాల్గొన్నారు.

యువగళంను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల, తిక్కారెడ్డి, తదితరులు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

ఈనెల 25న మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడబూరు మండలం గవిగట్టు రోడ్డు నుంచి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభమవుతుందని, కోసిగిలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, మంత్రాలయం టిడిపి ఇన్చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం కోసిగిలోని రేణుక ఎల్లమ్మ మైదానంలో భారీ బహిరంగ సభ స్థల ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయిందన్నారు. టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ల సభలకు వస్తున్న ప్రజలను చూసి తట్టుకోలేక వైసీపీ నాయకులు ఏకంగా టిడిపి అధినేత చంద్రబాబుపై రాళ్లదాడికి పూనుకున్నారని ఆరోపించారు. నారా లోకేష్ పాదయాత్రతో వైసిపి ఎమ్మెల్యేలకు,నాయకులకు వణకు మొదలైం దని వారన్నారు. కోసిగిలో జరుగు లోకేష్ బహిరంగ సభకు మంత్రాలయం నియోజకవర్గం లోని కౌతాళం, కోసిగి,పెద్ద కడుబూరు, మంత్రాలయం మండలాల నుంచి టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి ఆదివారం కోసిగిలో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జ్ఞానేష్ ,అయ్యన్న, కొండగని వీరారెడ్డి,సాతనూరు కోసిగయ్య, నాడిగేని మాదేవా,నడిగేని ఈరెడ్డి,శీను, పంపాపతి భరద్వాజ్ శెట్టి, రవితేజ శెట్టి, మారెప్ప, కప్పయ్య, లక్ష్మీకాంత్,గోపాల్, కృష్ణారెడ్డి, నరసింహులు, ఎంపీటీసీ రాజు, డీలర్ నర్సన్న, దేవన్న, లింగమూర్తి, ఉలిగయ్య, విజయ్, కలందర్ తదితరులు ఉన్నారు.

సామూహిక వివాహాలు శుభ పరిణామం

- ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి


నూతన దంపతులతో ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

నేటి సమాజంలో కులమతాలకతీతంగా సామూహిక వివాహాలు నిర్వహించడం శుభ పరిణామమని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. మానవతావాదులైన బాబు జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిరావు పూలే, విశ్వజ్ఞాని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, విశ్వగురు శ్రీ బసవేశ్వర స్వామి జయంతుల సందర్భంగా డిహెచ్పిఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక వివాహాలు ఆదివారం జరిగాయి. డిహెచ్పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి టీ.వీరేష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెల ంగాణ డిప్యూటీ కమిషనర్ కస్టమ్స్ ఆఫీసర్ ఆదోని వాసి నాగరాజు, జాతీ య మానవ హక్కుల కార్యదర్శిమోహన్ రాజు, ఆదోని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి, డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.మహేష్ హాజరయ్యా రు. ముందుగా ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కే. నాగరాజు బృందం సామాజిక అసమాన తలను తెలియజేసే గేయాలను ఆలపించారు. ఈ వివాహాల కార్యక్రమాన్ని ఆదోని ఎమ్మెల్యే వై. సాయి ప్రసాద్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్ర మాన్ని ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే నేడు అన్ని వర్గాలవారు సమాన హక్కులు పొందుతున్నారన్నారు. దళితులు ఉన్నత చదువులు చదువుకొని అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. హిందూ, క్రిస్టియన్ సంప్రదాయాల ప్రకారం వివాహాలు జరిగాయి. అనంతరం ఈ కార్యక్రమానికి సహకరించిన దళిత నాయకులందరికి శాలువా పూలమాలతో పాటు షీల్డ్ అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిహెచ్పిఎస్ జిల్లా సమితి సభ్యులు ఏ.విజయ్, నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కుమార్ స్వామి, పట్టణ అధ్యక్షులు టి.వంశీ, ఉపాధ్యక్షులు ఎం.రమేష్, ఏ.మణి, నాయకులు ఎం.గిరి మల్లప్ప, ఎస్. నాగరాజు, ఆవుల సురేష్, ఎన్.కే. సోమశేఖర్, వైటీ దేవేంద్ర, ఉదయ్, మోజేష్, టి. గోపి, లోకేష్, కే.సన్నీ, ఏ. పులి రాజు, ఆటో యూనియన్ నా యకులు చంద్ర, ప్రేమ్, ఉలిగేష్, సంజీవ్, తాయన్న, ఉద్యోగులు భాస్కర్, అమల్ నాథ్, మహాదేవప్ప, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముఖ్యఅతిథి కే. నాగరాజు

25న ధర్నాను జయప్రదం చేయండి



ప్రజాశక్తి - ఆదోని

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని కోరుతూ ఈనెల 25న కర్నూలులో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని ఎపి కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ జిల్లా ఛైర్మన్ మస్తాన్ పేర్కొన్నారు. ఆదివారం ఆదోని లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎపీ అమరావతి జేఏసి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరజు వెంకటేశ్వర్లు, జిల్లా ఛైర్మన్ గిరి కుమార్, ఏపీ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కోఆర్డినేటర్లు సుమన్, భానుజి హాజరై మద్దతు ప్రకటిస్తున్నారన్నారు. అన్ని శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తప్పక హాజరు కావాలని కోరారు.

అభివృద్ధిపై తిక్కారెడ్డి సెల్ఫీ చాలెంజ్

ప్రజాశక్తి - మంత్రాలయం

గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి పనులపై ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి సెల్ఫీలతో చాలెంజ్లు విసురుతున్నారు. ఆదివారం మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని కౌతాళం మండలంలో టిడిపి ప్రభుత్వ హయాంలో కుప్పగల్ నుండి కౌతాళం వరకు 14 కోట్ల రూపాయలతో 14 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు వేయించడం జరిగిందని రోడ్డుపై సెల్ఫ్ ద్వారా తెలియజేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్లు వేయడమే మానేశారని విమర్శించారు. నియోజకవర్గంలో అనేక చోట్ల ప్రధాన రహదారులు అన్నీ కూడా గుంతల మయంగా మారిపోయాయని ఆయన తెలిపారు. శనివారం నియోజ కవర్గంలోని కోసిగి సమీపంలో ఉన్న పులికనుమ ప్రాజెక్టు పనులు నిలిచి పోతే టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గ ప్రజలకు, త్రాగు నీరు, సాగునీరు అందించాలని పులి కనుమ ప్రాజెక్టు నుండి సుమారు 25000 ఎకరాలకు నీరు అందించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసి 80 కోట్ల రూపాయలు వెచ్చించి పనులు పూర్తి చేశారని పేర్కొన్నారు. ఇపుడు ఉన్న వైసిపి ప్రభుత్వం సాగు నీరు, తాగునీరు అందించకుండా వైసిపి నాయకులు దానిని చేపలు చెరువుగా మార్చారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేక పోయారని కేవలం మాటలు మాత్రమే చెబుతూ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు.


పులికనుమ ప్రాజెక్టును చూపిస్తున్న తిక్కారెడ్డి


దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

ఘనంగా తిక్కస్వామి ఉరుసు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని తిక్కస్వామి దర్గా ఉరుసు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణ ప్రజలే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు కూడా పెద్దఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ఫాతెహాలు నిర్వహించారు. దర్గా ముజావర్లు భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అక్కడికొచ్చిన ముస్లిం సోదరులు ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

సద్దుమణిగిన బొడ్రాయి, నవగ్రహ ప్రతిష్ట వివాదం

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తువ్వదొడ్డి గ్రామంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న నవగ్రహ, బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవ వివాదం సద్దుమణిగింది. గ్రామం లో రెండు వర్గాలు ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని వేర్వేరు తేదీలలో చేయాలని ఆహ్వాన పత్రికల్లో తేదీలను ముద్రించారు. దీంతో ఏ తేదీన నిర్వ హిస్తారో అర్థం కాని పరిస్థితుల్లో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. శని వారం ప్రజాశక్తి దినపత్రికలో తువదొడ్డిలో నవగ్రహ, బొడ్రాయి ప్రతిష్టపై వివాదం అనే శీర్షిక ప్రచురితమైంది. ఈ విషయంపై స్పందించిన పత్తికొం డ డిఎస్పి శ్రీనివాసులు, సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన రెండు వర్గాల వారిని పిలిపించి పత్తికొండ పోలీస్ కార్యాలయంలో చర్చించి ఒక తేదీని నిర్ణయించారు. ఈ విషయంపై స్థానిక ఎస్సై భూపాలుడుతో ఆదివారం మాట్లాడగా నవగ్రహ, బొడ్రాయి ప్రతిష్ట 1వ తేదీల్లో నిర్వహించేలా 2,3 తేదీల్లో కాశిరెడ్డి నాయన ఆరాధన ఉత్సవాలు జరిపేలా గ్రామస్తులతో మాట్లాడి వివాదం సద్దుమణిగేలా చర్యలు తీసుకున్నామన్నారు.

వైభవంగా శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఉప్పర వీధి ఇంద్రానగర్లో వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం ఆరవ వార్షికోత్సవం సందర్భంగా శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు రాముడు తెలిపారు. మంగళ వాయిద్యాల మధ్య పల్లకి సేవ కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఈరన్న, కోశాధికారి శాంతమూర్తి, రాజశేఖర్, శ్రీనివాసులలు, విజయ్, అధిక సంఖ్యలో భక్తజనం పాల్గొన్నారు.

ఘనంగా మౌనేశ్వర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి -హలహార్వి

మండలంలోని నిట్రవట్టి గ్రామంలో వెలసిన శ్రీ మౌనేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. రథోత్సవం సందర్భంగా భక్తులు అన్నాదన కార్యక్రమం చేపట్టారు. భక్తులుఅధిక సంఖ్యలో మౌనేశ్వర స్వామి దేవాలయంకు తరలివచ్చి స్వామి మొక్కులు చెల్లించారు. రాత్రి 7-30 గంటలకు వేలాది మంది భక్తులు జనసందోహం నడుమ రథోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గంధలేపనంతో రాఘవేంద్రుని దర్శనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని మూల బృందావనం గంధలేపనంతో భక్తులకు దర్శనమి చ్చారు. ఆదివారం అక్షయ తృతీయ సందర్భంగా శ్రీమఠంలో పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో చందన ఉత్సవం వైభవంగా నిర్వహిం చారు. ఈ ఉత్సవంలో భాగంగా శ్రీ మఠంలోని శ్రీ రాఘవేంద్రస్వామి బృం దావనం తో పాటు శ్రీ వాధీంద్ర తీర్థుల బృందావనానికి, ఇతర పూర్వపు పీఠాధిపతుల బృందావనాలకు గంధలేపనంతో అలంకరిచారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభు దేంద్రతీర్థులు రాఘవేంద్రుని మూల బృందావనానికి మంగళ హారతులు ఇచ్చారు.

120 కేజీలతో గర్భాలయ తలుపులకు వెండి తొడుగు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలోని గర్భాలయానికి గల తలుపులకు ఓ భక్తుడు 75 లక్షల రూపాయలతో 120 కేజీల వెండి తొడుగుతో అలంకరిచారు. కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరుకు చెందిన లక్ష్మి నారాయణ అనే భక్తుడు బెంగళూరుకు చెందిన శ్రీనివాసరాజు అనే శిల్పి ద్వారా శ్రీ మహావిష్ణువు దశవతారాలు కనిపించే విధంగా వెండి కవచాలతో తీర్చిదిద్ది, పైన గల గుమ్మానికి గజ లక్ష్మీ రూపాన్ని చిత్రీకరణతో తన కళా నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఆదివారం అక్షయ తృతీయ సందర్భంగా గంధలేపన ంతో అలంకరించి పండితుల వేద మంత్రాలతో మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలతో పీఠాధిప తులు సుభుదేంద్రతీర్థులు గర్భాలయ రజత ద్వారాలను ప్రారంభించారు.


వెండి తలుపులను ప్రారంభిస్తున్న దృశ్యం

అభ్యుదయవాది బసవేశ్వరుడు

ఘనంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - హాలహార్వి

సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యవాది బసవేశ్వరుడు అని పలువురు పేర్కొన్నారు. ఆదవారం మండలంలోని మేదేహల్ గ్రామంలోని బసవేశ్వర జయంతి కార్యక్రమం సర్పంచు ప్రహల్లాద గౌడ్,పటేల్ సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం వర్షాలు రావాలని,పంటల బాగా పండాలని బసవేశ్వర ఫోటోను ఎద్దుల బండ్లతో డప్పు మేళాలతో,మహిళలు హారతులతో ర్యాలీ చేసి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో రాజ గౌడు,బసవ భక్తు దాతలు తదితరులు పాల్గొన్నారు. **ఆలూరు:** ఆలూరు పట్టణంలో శ్రీ బసవేశ్వర స్వామి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు కోట వీధిలో వెలిసిన శ్రీ భీమ లింగేశ్వర స్వామి దేవస్థానం నందు వీరశైవ లింగాయితలు భీమలింగేశ్వర స్వామి దేవస్థానం నుండి మఠిస్వామి మఠం వరకు శ్రీ బసవేశ్వర స్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. అంతకుముందు తెల్లవారు జామున స్వామివారికి పంచామృత అభిషేకం, క్షీరభిషేకం పూజా కార్యక్రమాలు జరిపారు.


హాలహార్విలో..


ఆలూరులో..



మూఢనమ్మకాలతో పురోగతి శూన్యం

ప్రజాశక్తి - ఆదోని

మూఢనమ్మకాలతో నష్టాలేగాని, ఎలాంటి మానవ పురోగతి ఉందని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్నే వెంకటసుబ్బయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వి కృష్ణయ్య, సత్యనారాయణ, ఆర్సిసి రాజు, అధ్యాపకులు డాక్టర్ జి నల్లారెడ్డి ఉద్ఘాటించారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని ఆస్పరి రోడ్డులోని రాయలసీమ కోఆర్డినేషన్ కమిటీ భవనంలో విశ్రాంతి తహశీల్దార్ షేక్షావలి అధ్యక్షతన నిర్వహించిన హేతువాద సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. దయ్యాలు, భూతాలు లేవని అవి మోసగాళ్ల కల్పితాలేనన్నారు. డాక్టర్ దగ్గరకు వెళ్తే రోగం నయమవు తుందిగానీ, అంత్రాలు, మంత్ర, తంత్రాలకు రోగాలు నయం కావనే విష యాన్ని ప్రజలు గుర్తించినపుడే జీవితాలు బాగుపడతాయన్నారు. కర్ణాటక, ఒరిస్సా, మహారాష్ట్ర, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాల మాదిరి మన రాష్ట్రంలో కూడా ప్రభుత్వం మూఢ నమ్మకాలను నిర్మూలించే చట్టం తీసుకురావా లన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాల్లో శాస్త్రీయ ధృక్పథాన్ని ప్రవేశపెట్టాలని అన్నారు. అప్పుడే సమ సమాజ నిర్మాణం ఏర్పడు తుందన్నారు.

రెండు గ్రామాల మధ్య ముదురుతున్న దున్నపోతు వివాదం

డిఎస్పీకి ఫిర్యాదు చేసిన చిరుమాన్ దొడ్డి గ్రామస్తులు

ప్రజాశక్తి - ఆస్పరి

మండల పరిధిలోని చిరుమాన్ దొడ్డి,నగరూరు గ్రామాల మధ్య దున్నపోతు వివాదం గత నాలుగు రోజులుగా రచ్చకు ఎక్కింది. చిరుమాన్ దొడ్డి గ్రామస్తులు తాము వదిలిన మారెమ్మ దున్నపోతును నగరూరు గ్రామస్తులు పట్టుకొని తమదే అని బుకాయిస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయంపై చిరుమాన్ దొడ్డి గ్రామస్తులు రెండు రోజుల క్రితం నగరూరు గ్రామానికి వెళ్లి పంచాయతీ చేశారు. తమ దున్నపోతును తమకు ఇవ్వమని అడిగితే ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయిస్తామని భయోంధళలను గురి చేస్తున్నారన్నారు. పంచాయతీ తేగకపోవడంతో చిరుమాన్ దొడ్డి వాసులు పోలీస్ స్టేషన్ను ఆశ్రయించారు. ఆస్పరి పోలీసులు కూడా పరిష్కరించకపోవడంతో ఆదివారం డీఎస్సీ వినోద్ కుమార్ను కలిసి ఫిర్యాదు చేశారు. రెండు రోజులలో నగరూరు దేవర ఉందని అప్పటిలోగా సమస్యను పరిష్కరించాలని కోరారు. నగరూరు గ్రామస్తులు తమ దున్నపోతును గ్రామ దేవరకు బలిస్తే తాము ఊరుకునేది లేదన్నారు.రెండు గ్రామాల మధ్య అగ్నికి ఆజం పోస్తున్న దున్నపోతు వివాదాన్ని పోలీసులు శాశ్వతంగా పరిష్కరించాలని రాజకీయ పార్టీ నాయకులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మహానంది, రామకృష్ణ,మల్లికార్జున రంగస్వామి,రామ్ నాయుడు పాల్గొన్నారు.

ఈ రోడ్లు ఇంతేనా?..

పాలకులు పట్టించుకోరా?

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఉత్తదేనా


గుంతలు పడ్డిన రోడ్డు


అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి - హోళగుంద

ఇక ఈ రోడ్లు ఇంతేనా? పాలకులు పట్టించుకోరా? ఎన్నికలు ఇచ్చినామీలు నెరవేర్చరా? అని మండల ప్రజలు మండిపడుతున్నారు. కర్ణాటక సరిహద్దు గ్రామము మార్ల మడికి, ధనాపురం టు హోళగుంద దుస్థితి ఇంతేనా అని, కర్ణాటక బార్డర్లోకి అడుగు పెట్టడానికి 5 కిలోమీటర్లు మాత్రమే ఉంది. ఈ రోడ్లన్నీ గుంతల మాయమైన ఉండటంతో ఎక్కడికి వెళ్ళాలన్నా.. సమయం వృథా కావడమే కాకుండా నానా అవస్థలు పడి గమ్యస్థానానికి చేరుకొని హమ్మయ్య.. గడ్డం నుండి గట్టెక్కాము ఇక బయటపడ్డ అనిపిస్తుందని ప్రయాణికులు చర్చించు కోవడం గమనార్హం. మార్ల మడికి రోడ్లో ఎల్లార్తి దర్గాకు వచ్చే భక్తులు అధిక సంఖ్యలో కర్ణాటక రాష్ట్రం నుండి ఇదే మార్గంలో చేరుకోవాల్సిన పరిస్థితి ఉన్నది. అయితే మార్లమడికి రోడ్డు భూమి పూజకే పరిమితం అయింది. కార్మిక శాఖ మంత్రి వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డ ఆరు నెలల తర్వాత మార్ల మడికి రోడ్డుకు నిధులు కేటాయించామని రూ.2 కోట్ల 60 లక్షల మంజూర య్యాయని సంబంధిత శాఖ అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. మంత్రి శంకుస్థాపన చేశారు ఇక మన రోడ్డు పనులు పూర్తి అయినట్లు అని మండల ప్రజలు భావించారు. భూమి పూజ చేసి మూడు సంవత్సరాలు అయినా పనులు మొదలు పెట్టకపోవడంతో ఇక రోడ్ల పరిస్థితి ఇంతే అని మండల ప్రజలు పేర్కొంటున్నారు. హోళగుంద టు ధనాపురం రోడ్కు రూ.65 కోట్లు మంజూరు కాగా రూ.59 కోట్లతో గుత్తేదారులు పనులు దక్కించుకున్నారు. గత డిసెంబర్ నెలలో పనులు మొదలుపెట్టి రోడ్డుకి ఇరువైపులా పదును చేయడం ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఈసారి కచ్చితంగా రోడ్ నిర్మాణ పనులు పూర్తి అవుతాయని భావించి ఆనందంలో మునిగిపోయారు పనులు ప్రారంభించి నెల రోజులు పూర్తికాకముందే సదరు గుత్తేదారులు కూడా వెనక్కి తిరిగి వెళ్లారు. బిల్లులు సకాలంలో రావడంలేదు.. ప్రజా ప్రతినిధులకు పర్సంటేజీలు ఇవ్వాలని ఒత్తిడి పెట్టడంతో గుత్తేదారులు వెనక్కి వెళ్లిన్నట్లు చర్చించుకుంటున్నారు. హోళగుంద మండలానికి చేరుకోవాలన్న ఏ రోడ్ లో చూసినా.. గుంతలు గుంతలుగా ఉండటంతో గర్భిణీలు, పాము కాటుకు గురైన వారు, దీర్ఘకాలిక రోగాలు కర్ణాటక రాష్ట్రం బళ్లారి లేదా కర్నూలు జిల్లా కేంద్రాలకు వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లక తప్పడం లేదు. మహిళలైతే నరక యాతన అనుభవిస్తున్నట్లు బహిరంగంగా చర్చించుకుం టున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి గుత్తేదారులతో చర్చలు జరిపి రోడ్ల మరమ్మతులు చేపట్టుటకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - కోసిగి రూరల్

ప్రతిరోజు ధ్యాన సాధన వలన సంపూర్ణ ఆరోగ్యం మానసిక ప్రశాంతత కలుగుతుందని టీజీ పాండురంగయ్య శెట్టి, కెపి వీరన్న శెట్టిలు అన్నారు. ఆదివారం కోసిగిలోని ఎన్టీఆర్ కాలనీలో అర్లబండ తిక్కయ్య ఆధ్వర్యంలో పిరమిడ్ నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీ పాండురంగయ్య శెట్టి, కె.పి వీరన్న శెట్టి, రాఘవరెడ్డి, వెంకటరామిరెడ్డిలు పాల్గొన్నారు. అంతకుముందు టీజీ మధు ఇంటిపై నిర్మించిన పిరమిడ్ ధ్యాన కేంద్రంను రీఓపెనింగ్ చేశారు. అనంతరం శాఖాహార ర్యాలీని కోసిగి యల్లమ్మ గుడి నుంచి వాల్మీకి సర్కిల్ మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యంతో ఏగగ్రత జ్ఞాపకశక్తి అభివృద్ధి చెంది, ఆందోళనలు తగ్గుతాయిని వారు అన్నారు. మానసిక ఒత్తిడి నుంచి ప్రశాంతత లభిస్తుందని, ఆత్మవిశ్వాసం ధైర్యం పెరిగి జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సైతం జయిస్తామని వారు అన్నారు.కార్యక్రమంలో అర్లబండ అనందమ్మ, మఠిస్వామి దోర, టిజి రాధ తదితరులు పాల్గొన్నారు.

దుప్పనగుర్తిలో మంచినీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని పి కోటకొండ మజారా గ్రామం దుప్పనగుర్తి గ్రామంలో గత కొన్నేళ్లుగా నెలకొన్న మంచినీటి సమస్యను రాష్ట్ర ఉపాధి కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆయన సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి సహకారంతో మంచినీటి బోరు వేయిం చడంతో 2 ఇంచుల నీరు పడడంతో గ్రామస్తుల మంచినీటి సమస్య పరిష్కారమైందని గ్రామ సర్పంచ్ తిమ్మక్క భర్త పెద్ద లింగన్న, వైస్ ఎంపీపీ మాదక్క, ఎంపీటీసీ వెంకటలక్ష్మి లు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచినీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు మంత్రి గుమ్మనూరుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు హనుమంత రెడ్డి, మీనుగా కృష్ణ, లక్ష్మణ స్వామి, ముచ్చు రామచంద్ర, రామానాయుడు, నాగప్ప, కృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి

సోమవారం 24 ఏప్రిల్ 2023 5

నంద్యాల



రాజకీయ లబ్ధి కోసమే మత కలహాలు

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు

ప్రజాశక్తి - ఆత్మకూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసమే మతకలహాలను సృష్టిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు విమర్శించారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని వాల్మీకి నగర్, వడ్డపేట, కుమ్మరి పేట కాలనీలలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఎన్ఆర్సి, సిఎఎ పేరుతో ముస్లింలను ఈ దేశం నుంచి తరలించేందుకు కుట్ర చేస్తుందని అన్నారు. దళితులపై దాడులు, హత్యాచారాలు పెరిగిపోయాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్షాలను బెదిరించడం, కేసులు పెట్టడం, లొంగదీసుకోవడం, ప్రాంతీయ పార్టీలను కూల్చివేయడం చేస్తున్నారని విమర్శించారు. అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. ఆదాని, అంబానీ లాంటి పెట్టుబడుదారుల ప్రయోజనాల కోసం భారత సంపదనంతా కొల్లగొట్టి, పెట్టుబడిదారులకు నరేంద్ర మోడీ ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. హిందూ, ముస్లింలు, క్రిస్టియన్లు ఐక్యమత్యంతో భారతదేశ స్వతంత్రాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేశ్వర్లు, పకీర్ సాబ్, ప్రజాసంఘాల నాయకులు ఉస్మాన్ భాష, సోడా బిబి, జయ రాణి, ఉపేంద్ర, రాంబాబు, షాలు, వెంకటేశ్వర్లు, నాగరాజు, రఫీ, పాండు తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** మతోన్మాద బిజెపి ప్రభుత్వం నుండి దేశ ప్రజలను కాపాడుకుందామని సిపిఎం సీనియర్ నాయకులు వై. ఎల్లయ్య, మండల కార్యదర్శి అర్.ఈశ్వరయ్యలు తెలిపారు. పట్టణంలోని సుబ్బారెడ్డి నగర్, జంగాలపేట, కొత్త బస్టాండ్, ధరణి కాలనీ, ఎంపిడిఒ, ఎంఆర్ఒ ప్రాంతాలు, కోటకింది పేటలలో ప్రచార భేరి పాదయాత్ర నిర్వహించారు. సిపిఎం నాయకులు ఎస్కె.భాష, ఎన్.బాలయ్యల అధ్యక్షతన రెండు దళాలుగా ఏర్పడి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కరపత్రాలు పంపిణీ చేవారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజు, చిన్నబ్బి, ఆంజనేయులు, రాజబాబు, నరసింహుడు, అంకాలు, యువరాజు, కావేటి చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు



బేతంచెర్ల : మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే వసతి, దర్శనం రిజర్వు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం దేవస్థానంలో ఇకనుండి వసతి దర్శనం ఆన్‌లైన్‌లోనే భక్తులు రిసర్వ్ చేసుకోవాలని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి లవన్న సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో శ్రీశైలం దేవస్థానంలో వసతి, ఆయా ఆర్జిత సేవ టికెట్లు, స్వామి అమ్మవార్ల దర్శనం టికెట్లు, శీఘ్ర, అతి శీఘ్ర దర్శనం టికెట్లు ఇకనుండి భక్తులు ఆన్లైన్లోనే ముందస్తుగా రిజర్వ్ చేసుకోవాలని సూచించారు. ఆన్లైన్లో టికెట్ పొందేందుకు దేవస్థానం అధికారిక వెబ్సైట్‌ను రూపొందించిందని చెప్పారు. ఆన్లైన్ ద్వారా టికెట్ పొందేందుకు దేవస్థానం అధికారిక వెబ్ సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ శ్రీశైల దేవస్థానం డాట్ ఓఆర్‌జి లేదా దేవాదాయ శాఖ అధికారిక వెబ్సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ ఏపీ టెంపుల్స్ ఏపీ గవర్నమెంట్ డాట్ ఇన్ వెబ్ సైట్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా భక్తులు శ్రీశైల దేవస్థానం వెబ్సైట్, దేవదాయ శాఖ వెబ్సైట్లు కాకుండా ఇతర నకిలీ వెబ్సైట్ల ద్వారా నమ్మి మోసపోవద్దని భక్తులకు సూచించారు.

కంటైనర్ దొంగల అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడు అరెస్ట్

- రూ.5.92 లక్షల విలువైన సొత్తు, రూ.8 లక్షల కారు స్వాధీనం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

హైవేలలో వెళ్తున్న కంటైనర్‌లలో దొంగతనం చేసే అంతర్రాష్ట్ర కంజర్బట్ ముఠా సభ్యుడిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి ఆదివారం తెలిపారు. రూ,. 3 లక్షల 92 వేల విలువైన సొత్తు, రూ. 8 లక్షల విలువ చేసే కారును స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌పి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.... మధ్యప్రదేశ్ రాష్ట్రం షాజాపూర్ జిల్లా గులానా తాలూకా మక్వడా గ్రామానికి చెందిన సంజయ్ పడిహర్ ఈ ఉఏడాది ఫిబ్రవరి 21న హైదరాబాద్ నుండి బెంగళూరుకు వెళ్తున్న కంటైనర్‌లో వెనుక భాగంలో సీల్ కట్ చేసి అందులో 17 మల్బారో సిగరెట్ బాక్స్‌లను, మార్చి 16న హైదరాబాద్ నుండి బెంగళూరుకు వెళ్తున్న కంటైనర్‌లో 65 సిల్వర్ మాక్స్ కంపెనీ షేవింగ్ బ్లేడ్ బాక్స్‌లను దొంగతనం చేశాడు. ప్యాపిలి పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రెండు హైవే దొంగతనం కేసులలో డోన్ ఎస్‌డిపిఒ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల సిసిఎస్ సిఐ పి.రామకృష్ణ, ప్యాపిలి సిఐ పి.శ్రీరాములు, నంద్యాల సిసిసి శ్రీనివాసులు, ప్యాపిలి ఎస్‌ఐ సిఎం రాకేష్, సిబ్బందికి అందిన కచ్చితమైన సమాచారం మేరకు సిబ్బంది షాజాపూర్ జిల్లాకు చేరుకొని సంజయ్ పడిహర్‌ని మక్వడా ఊరి బయట ఉన్న రాయల్స్ డాబా వద్ద ఈ నెల 22న శనివారం పట్టుకున్నారు. విచారణలో అతను నేరం అంగీకరించాడు. దొంగతనం చేసిన సుమారు 2 లక్షల 96 వేల రూపాయల విలువ గల 20 బ్లేడ్ బాక్స్‌లను, నేరానికి ఉపయోగించిన సుమారు 8 లక్షల విలువ చేసే క్రెటా కారును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. అలాగే అంతకు ముందు ఈ కేసులలో అతని సహచరులైన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 20 బ్లేడ్ బాక్స్‌లను స్వాధీన పరచుకొని రిమాండ్‌కు పంపామన్నారు. ఈ సంచలనమైన కేసును డిటెక్ట్ చేయడానికి ప్రత్యేక బృందం సిసిఎస్ సిఐ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం వివిధ ప్రాంతంలో తిరిగి సమాచారం సేకరించి ప్యాపిలి పోలీస్ స్టేషన్‌లోని 2 కేసులను డిటెక్ట్ చేసి చేసిన ప్యాపిలి సిఐ పి.శ్రీరాములు, సిసిఎస్ ఎస్‌ఐ శ్రీనివాసులు, ప్యాపిలి ఎస్‌ఐ సిఎం రాకేష్, సిబ్బంది హెచ్‌సి ఇబ్రహీం అలియాస్ మున్నా, పిసిఎస్ హుస్సేన్ బాషా, శివ ప్రసాద్, వెంకటేష్, టెక్నికల్ సిబ్బంది మధు, శేఖర్ రెడ్డిలకు ఎస్‌పి నగదు బహుమతి అందజేసి అభినందించారు.



స్వాధీనం చేసుకున్న వాహనాన్ని మీడియాకు చూపుతున్న ఎస్‌పి

త్వరలో 'ఆటోమేటిక్' లైసెన్స్‌లు

- నిబంధనలు పాటించకుంటే చర్యలు
- విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు
- చలానాలు తప్పని సరిగా చెల్లించాలి
- ప్రజాశక్తితో రవాణా శాఖ ఉప కమిషనర్ శ్రీధర్

ప్రజాశక్తి - కర్నూలు క్రైం



త్వరలో ఆటోమేటిక్ విధానంలో వాహన లైసెన్సుల జారీ ప్రక్రియ ప్రారంభం అవుతుందని రవాణా శాఖ ఉప కమిషనర్ (డిటిసి) కె.శ్రీధర్ అన్నారు. జిల్లాలో ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రమాదాలను నివారించడానికి అవసరమైన చర్యలను చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ప్రజల్లో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని, వాటిని అతిక్రమించిన వారిపై చర్యలు చేపడుతూ ప్రమాదాలను నియంత్రించడానికి కషి చేస్తున్నామని ప్రజాశక్తి ఆయనతో నిర్వహించిన ముఖాముఖిలో పేర్కొన్నారు.

డ్రైవింగ్ పరీక్షల విధానంలో మార్పులేమైనా ఉన్నాయా?

డిటిసి : గతంలో వాహనాల డ్రైవింగ్ పరీక్షలను మ్యాన్యువల్ విధానంలో నిర్వహించే వాళ్ళం. త్వరలో డ్రైవింగ్ ఆటోమేషన్ సిస్టం ద్వారా నిర్వహించనున్నాం. వాహనానికి జిపిఎస్ అనుసంధానం ద్వారా వెళ్లిన మార్గంతో పాటు, డ్రైవింగ్ గ్రాఫ్ కూడా ఈ విధానంలో నమోదు అవనుంది. దాని ఆధారంగా ఆన్‌లైన్‌లో ఆటోమేటిక్‌గా డ్రైవింగ్ పరీక్షలో పాస్ లేదా ఫెయిల్ అనేది తేలుతుంది. ఈ పరికరాల బిగింపు ప్రక్రియ పూర్తయింది. దానికి సంబంధించిన డేటా ఎన్ ఐ సి తో లింక్ కావలసి ఉంది. అది పూర్తవగానే నూతన విధానంలో వాహన లైసెన్సులు జారీ చేస్తాం.

జిల్లాలో ఇటీవల వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి కదా? వాటి నివారణ కోసం ఏమైనా చర్యలు చేపడుతున్నారా?

డిటిసి : అవును నిజమే! గతంలో జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. వాటిని దష్టిలో ఉంచుకుని నివారణ కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలను చేపడుతున్నాం. ముఖ్యంగా ప్రతి మూడో శుక్రవారం రోడ్డు భద్రత కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. ఇందులో ప్రధానంగా ఆర్అండ్‌బి, ఎన్‌హెచ్ఎఐ, పోలీసు, పంచాయతీ రాజ్, మున్సిపల్ అధికారుల సమన్వయంతో చర్చించి నిర్ణయాలు చేస్తున్నాం. 20 రకాల అంశాలతో భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. అందులో ప్రధానంగా నేషనల్ హైవేలపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించడం, స్పీడ్ బ్రేకర్లు, హైమాస్కు లైట్లు ఏర్పాటు, ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు వంటి వాటితో పాటు మరికొన్ని ప్రమాద నివారణ కార్యక్రమాలను చేపడు తున్నాం. రోడ్డు అభివద్ధి పనులు చేపడుతున్నాం. అందులో భాగంగా ఆస్పరి నుంచి కర్నూలు వైపు 30 కిలో మీటర్ల మేరకు రూ.20 లక్షలతో రోడ్డు అభివద్ధి పనులు, ట్రాఫిక్ జంక్షన్‌లలో సమయానుకూలంగా ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ కంట్రోలుకు కషి చేస్తున్నాం. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వైపు నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు నేషనల్ హైవేపై ఉన్న స్పీడు బ్రేకర్లను తొలగింపు, రోడ్డు ఆధునీకరణ పనులు చేపట్టాం. ట్రాఫిక్ ఐల్యాండ్లను గుర్తించాం. అందులో భాగంగా ప్రధానంగా రాజ్ విహార్, బళ్లారి చౌరస్తా, బిర్లా గేటు, మద్దూరు నగర్ జంక్షన్‌ల వద్ద రోడ్ల ఎన్‌క్రోచ్‌మెంట్లు, రోడ్ల క్రమబద్ధీకరణ పనులు చేపడుతున్నాం.

జిల్లాలో ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎంత ఆదాయం వచ్చింది?

డిటిసి : జిల్లాలో గత ఏడాది 18వేల కేసులు నమోదు చేశాం. రూ.17.33 కోట్లు ఫైన్ వేశాం. గత నెలలో 680 కేసులు నమోదు చేశాం. రూ.8 లక్షల జరిమానా విధించాము.

పాఠశాలల బస్సుల భద్రత ఎలా ఉంది..?

డిటిసి : జిల్లాలోని పాఠశాలల బస్సులపై విద్యా సంవత్సర ప్రారంభంలో ప్రత్యేక దాడులను నిర్వహించాం. దీంతో వందశాతం బస్సులు ఫిట్ నెస్ ను కలిగి ఉన్నాయి. పాఠశాలల బస్సులన్నీ ప్రమాణాలకు తగినట్లుగా ప్రత్యేక ఏర్పాట్లు కలిగి ఉండాలి.

రవాణా శాఖలో ఫీజులేమైనా పెరిగాయా..?

డిటిసి : సాధారణ రవాణా సేవలకు సంబంధించి అన్నీ పాత ఫీజులే ఉన్నాయి. తాజాగా వాహనాల రిజిస్ట్రేషన్ ఫ్యాన్సీ నంబర్ల రిజర్వేషన్ ఛార్జీలు మాత్రం పెరిగాయి. ఈ ఛార్జీలు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఉన్నాయి.



నేడు స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో నేడు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరుకావాలని, అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



వాల్ పోస్టర్ను విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోడీని గద్దె దించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

కార్పొరేట్ శక్తులకు అండగా ఉన్న ప్రధాని నరేంద్ర మోడీని గద్దె దించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకులు శంసుల్ హక్, మండల అధ్యక్షులు బరగొడ్ల హుస్సేన్ భాష అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జై భారత్ సత్యాగ్రహ పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నో వాగ్దానాలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందన్నారు. ఈనెల 24న చలో విజయవాడ కార్యక్రమం జై భారత్ సత్యాగ్రహ సభలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాల నియోజకవర్గ పరిధిలో 12 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరయిన రూ.8 లక్షల 28 వేలు చెక్కులను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు నియోజకవర్గ పరిధిలో 4 కోట్ల 85 లక్షల 48 వేల రూపాయలను సిఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధిదారులకు అందజేసినట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకంలోకి రాని రోగాలకు సిఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నట్లు చెప్పారు. సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేకంగా నంద్యాల నియోజకవర్గం ప్రజల తరపున, లబ్ధిదారుల తరుపున ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



పరీక్షలను తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్, ఎంఇఒ, అబ్జర్వర్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

ప్రజాశకి - పగిడ్యాల

మండలంలోని లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఇఒ సుభాన్, ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మలు పరీక్షలను తనిఖీ చేసి మాట్లాడారు. గురుకులంలో ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ మొదటి సంవత్సరం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు పరీక్షలు నిర్వహించామన్నారు. 5వ తరగతి 675 మంది విద్యార్థులకుగాను 146 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, ఇంటర్ మొదటి సంవత్సరం 313 మంది విద్యార్థులకు గాను 54 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు తెలిపారు.

1 నుంచి వేసవి ఉచిత షటిల్ బ్యాడ్మింటన్ : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

వేసవిలో నిర్వహించే ఉచిత షటిల్ బ్యాడ్మింటన్‌ను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. ఆదివారం డోన్ పట్టణంలోని బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డోన్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో సమ్మర్ ఫ్రీ షెటిల్ బ్యాడ్మింటన్ అబ్బాయిలకు, అమ్మాయిలకు మే 1 నుండి జూన్ 10 వరకు బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుండి 11:30 గంటల వరకు కోచ్ నాగేంద్ర అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకిర్ హుస్సేన్, కౌన్సిలర్లు టిఇ.దినేష్ గౌడ్, నాగేంద్ర, నంద్యాల జిల్లా బిసి సెల్ అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్, పట్టణ యూత్ అధ్యక్షుడు రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

చైర్మన్ పదవి వెంకట రామరాజుకే ఇవ్వాలి

- ఎపి బిఎస్ఎస్ డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

పేద మధ్యతరగతికి చెందిన బ్రాహ్మణ కుటుంబాలకు కల్పవృక్షంలా ఉండే బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఎపి బ్రాహ్మణ సంక్షేమ సమైక్య అధ్యక్షులు వెంకట రామరాజుకే ఇవ్వాలని ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర కార్యదర్శి నగర డోణ సుధీర్ తెలిపారు. ఆదివారం నంద్యాలలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటరామరాజు అనేక సంవత్సరాలుగా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, లయన్స్‌క్లబ్ వారికి సహాయ సహకారాలతో అనేక సేవా కార్యక్రమాలను స్వచ్ఛంధంగా నిర్వహించారని తెలిపారు. కావున ప్రస్తుతం ఖాళీగా ఉన్న కార్పొరేషన్ చైర్మన్ పదవిని రామరాజుకు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సమాఖ్య నాయకులు రాజశేఖర్, శ్రీనాథ్, భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపి బిఎస్ఎస్ నగర డోణ సుధీర్

సమాజసేవకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

ప్రజాశక్తి - డోన్

సమాజ సేవ చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రార్ధన సమయం నిర్వాహకులు జాన ప్రభాకర్ అన్నారు. టీచర్స్ కాలనీకి చెందిన కమలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు జీవన్ కుమార్ ఆర్థిక సహాయంతో ఆదివారం డోన్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, గర్భిణులకు, బాలింతలకు రొట్టె, పప్పు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రార్ధన సమయం నిర్వాహకులు జానప్రభాకర్ మాట్లాడుతూ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారు ఏదో ఒక అనారోగ్యంతో ఆస్పత్రికి వస్తుంటారని, దాతల సహాయ సహకారంతో రొట్టె, పప్పు, గుడ్లు ఇవ్వడం వలన ఎంతో సంతోషంగా ఉందన్నారు. పది మందికి ఉపయోగకరమైన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఫక్రుద్దీన్, హోసన్నా వృద్ధాశ్రమం సూపర్వైజర్ భారతి తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా

నీటి సమస్యను పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

శ్రీశైలం మండలం సుండి పెంటలో నెలకొన్న నీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తెలిపారు. ఆదివారం శ్రీశైలం మండలం సుండిపెంటలోని వెస్ట్రన్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ముందుగా ఫిల్టర్ హౌస్ సెంటర్ నుండి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి, నియోజకవర్గ సమన్వయకర్త భువనేశ్వర్ రెడ్డికి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వెస్ట్రన్ కాలనీలోని పాలిటెక్నిక్ కళాశాల దగ్గర బోయ క్యాంపు, మసీదు దగ్గర అక్కడి నుండి సత్యనారాయణ స్వామి గుడి వెనకవైపు కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రధాన నీటి సమస్యను కూడా త్వరలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆత్మకూరు మోహన్ కుమార్, ఏపీఎస్పీడీసీఎల్‌ఏ సత్యనారాయణ, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది, స్థానిక వైసిపి నాయకులు భరత్ రెడ్డి, వట్టి వెంకట్ రెడ్డి, ఎంఎ. రజాక్, గుండయ్య యాదవ్, సచివాలయ సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు : ఎఇ

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని బి.నాగిరెడ్డిపల్లి గ్రామంలో 20 కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు ఏఈ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడప గడపకు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించినప్పుడు గ్రామస్తులు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారని చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే గడపగడప కార్యక్రమానికి కేటాయించిన నిధులతో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో ఏర్పాటు చేశామన్నారు. దీంతో గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారం అయిందన్నారు.



కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం


స్వీపర్ మద్దిలేటి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి

స్వీపర్ మద్దిలేటి మృతి బాధాకరం

- మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని కరింబాగ్ చెందిన పారిశుధ్య కార్మికుడు మద్దిలేటి మృతి బాధాకరమని పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి నివాసంలో స్వీపర్ మద్దిలేటి కుటుంబానికి బిసి రాజారెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలో మద్దిలేటి గత 25 సంవత్సరాల నుంచి పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తూ ఉన్నత సేవలు అందించాడన్నారు. రెండు రోజుల క్రితం మద్దిలేటి అకస్మాత్తుగా మీతి చెందాడన్న వార్త తనను కలచివేసిందన్నారు. ఇప్పటివరకు ఎలాంటి విమర్శలకు తావు లేకుండా మద్దిలేటి పనిచేసి అటు ప్రజలు, ఇటు అధికారుల మన్ననలు చూరగొన్నాడన్నారు. మద్దిలేటి కర్మకాండల కోసం వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. వారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : జిల్లాలోని నంద్యాల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ పరిధిలో మెయిన్ అంగన్వాడీ కార్యకర్త-1, అయా పోస్టులు-6 నియమకాలకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సిడిపిఒ చంద్రకళ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యకర్త పోస్టునకు 10వ తరగతి పాస్, అయా పోస్టుకు 7వ తరగతి పాస్ పాస్ కావాలన్నారు. 1.7.2022 నాటికి 21 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలని, పెళ్లి అయి అదే గ్రామంలో నివసించాలని, నియామకాలలో రూల్ అఫ్ రిజర్వేషన్ పాటించనున్నట్లు తెలిపారు. ఖాళీల వివరాలకు సంబంధిత సిడిపిఒ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ నెల 24 నుండి మే 1 సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయ పని దినాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు సిడిపిఒ కార్యాలయం, ఐసిడిఎస్ ఆఫీస్, 9885758605 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : కొలిమిగుండ్లలోని క్రాసింగ్‌లో కస్తూర్బా స్కూల్ దగ్గర హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, సభ్యులు ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆళ్లగడ్డ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి, కొలిమిగుండ్ల ఎస్సై రమేష్ రెడ్డిలు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకట రాముడు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, కస్తూరిబా స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న దృశం

టిడిపి నుంచి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల: మండలంలోని కల్వటాల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు తలారి చిన్న నాగన్న, నాగేంద్ర, లక్ష్మినారాయణ, శివయ్య, రామకృష్ణా రెడ్డి కుటుంబాలు ఆ పార్టీని వీడి బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వైసిపిలో చేరారు. కొలిమిగుండ్లలోని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కార్యాలయంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా పార్టీ ప్రచార అధ్యక్షుడు పేరం సత్యనారాయణ రెడ్డిల సమక్షంలో వైసిపిలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసిపిలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారందరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మళ్ళీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని చేసుకోవడానికి అందరం కష్టపడాలన్నారు. కార్యక్రమంలో కల్వటాల వైసిపి నాయకులు తిమ్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలీస్ స్టేషన్లలో స్పందన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని డీఎస్పీ కార్యాలయంలో, సర్కిల్ ఆఫీసులలో, అన్ని పోలీస్ స్టేషన్లో నేడు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిఎస్‌పి సుధాకర్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదిదారులు ఏమైనా సమస్యలు ఉంటే ఆయా పోలీస్ స్టేషన్లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో విన్నవించి పరిష్కరించుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ పోలీసులకు చలువ అద్దాలు, టోపీలు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ట్రాఫిక్ పోలీసులు ఎండవేడిమి నుండి ఉపశమనం పొందేందుకు శ్రీ రెంటల మారుతీ కుమార్ మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ కాత్యాయని మెడికల్స్ అండ్ సర్జికల్స్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ వారి సహకారంతో కౌబాయ్ టోపీలు, చలువ కళ్ల అద్దాలు, తెలుపు, నీలం టోపీలను జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. ఈ పర్సనల్ కిట్‌లను జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, నంద్యాల టౌన్ డిఎస్పీలు కాత్యాయని మెడికల్ అండ్ సర్జికల్ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్ముడు రిజర్వు పోలీస్, అడిషనల్ ఎస్పీల చేతుల మీదుగా ట్రాఫిక్ పోలీసులకు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్.రమణ, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, నంద్యాల టౌన్ డిఎస్పి సి.మహేశ్వర్ రెడ్డి, టౌన్ సిఐలు, సిసిఎస్ సిఐ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మరమ్మతులు పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : పట్టణంలో లీకేజీ అయిన పైపులైన్ల పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్ర రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక టెక్కే మార్కెట్ యార్డ్ వద్ద పగిలిపోయిన వాటర్ పైప్‌లైన్ పుణరుద్ధరన పనులను డి.శ్రీనివాసులు రెడ్డితో కలిసి కమిషనర్ పరిశీలించారు. పైప్‌లైన్ పుణరుద్ధరన పనులను త్వరతగతిన పూర్తి చేసి నీటి అంతరాయం లేకుండా చూడాలని డిఇని ఆదేశించారు.

నీటి కోసం ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని చిన్నబోధనం పాత కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఆదివారం కాలనీలో నీటి బోరు పని చేయకపోవడంతో నీటి కోసం కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలనీ నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న పెదబోధనం గ్రామం వద్ద గల గంగమ్మ గుడి వద్ద పంప్ హౌస్ నుంచి వచ్చే నీటిని పట్టుకొని ఎద్దుల బండ్ల ద్వారా, ద్విచక్ర వాహనాల మీద తీసుకెళ్లారు. ఎండలు అధికం కావడంతో ప్రజలు తాగు నీటి కోసం ఇక్కట్లకు గురయ్యారు. అధికారులు, పాలకులు స్పందించి నీటి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువగళంలో వినతుల వెల్లువ

- ఆదోనిలో లోకేష్ యువగళం

ప్రజాశక్తి-ఆదోని/ఆదోని రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళంలో అడుగడుగునా ప్రజలు, పలు సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను విన్నవిస్తున్నారు. యువగళం పాదయాత్ర ఆదివారం ఆదోని నియోజకవర్గంలో సాగింది. కడితోట క్యాంప్ శిబిరం నుంచి ప్రారంభమైన యాత్ర గనేకల్ క్రాస్, జాలమంచి, పాండవగల్, బలేకల్ క్రాస్, కుప్పగల్ మీదుగా పెద్ద తుంబలం క్రాస్ వరకు సాగింది. గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, పది రోజులకు ఒకసారి తాగునీరు వస్తోందని గణేకల్లు గ్రామస్తులు లోకేష్‌ను కలిసి విన్నవించారు. జాలమంచి గ్రామస్తులు లోకేష్‌ను కలిసి పలు సమస్యలు విన్నవించారు. తాగునీటి సమస్య ఉందని, పొలాలకు తుంగభద్ర, ఎల్‌ఎల్‌సి నుంచి ఎత్తిపోతల ద్వారా సాగునీటిని అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. తాగు, సాగునీటి సమస్య లేకుండా చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. గణేకల్లు శివారులో సజ్జచేలో దిగి రైతు గొల్ల నాగరాజు కష్టాలను లోకేష్ తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం డిడి కట్టి ఏడాది అయినా ఇంకా రాలేదని రైతు తెలిపారు. కడితోట శివారులో దూదుకుల ఇస్మాయిల్ అనే వికలాంగుడు లోకేష్‌ను కలిశారు. తనకు 3 ఎకరాల పొలం ఉంటే 30 ఎకరాలు ఉన్నట్లు రికార్డుల్లో చూసి పెన్షన్ తీసేశారని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వైసిపి ప్రభుత్వం అక్రమంగా తొలగించిన పెన్షన్లన్నీ పునరుద్ధరిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. కుప్పగల్ మధ్యాహ్న విరామ శిబిరం వద్ద బిసి సామాజికవర్గ ప్రతినిధులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. టిడిపి అధికారంలోకి రాగానే బిసిలకు రక్షణ చట్టం తెస్తామని లోకేష్ తెలిపారు. వాల్మీకులను వైసిపి మోసం చేసిందని, వారు ఏ కులంలో ఉన్నా ఆదుకోవడానికి రాయితీ రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. టిడిపి అధికారంలోకి రాగానే రజకులకు వాషింగ్ మెషిన్‌తో పాటు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. రాయలసీమ దాటేలోపు సీమ అభివృద్ధిపై బ్లూప్రింట్ విడుదల చేస్తానన్నారు. కుప్పగల్లులో న్యాయవాదులతో లోకేష్ భేటీ అయ్యారు. పెద్ద తుంబలంలో లోకేష్‌కు టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ముస్లిం విద్యార్థులకు ఉర్దూ పాఠశాల, జూనియర్ కాలేజీ లేవని పెద్ద తుంబలం గ్రామస్తులు లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. అలకనుమ ప్రాజెక్టు నుంచి పొలాలకు తూము ఏర్పాటు చేయాలని, పెద్ద తుంబలాన్ని మండలకేంద్రంగా చేయాలని కోరారు. పెద్దతుంబలం విడిది కేంద్రంలో లోకేష్ బస చేశారు. ఆదివారం మొత్తంగా 15.2 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది. యాత్రలో మాజీ ఎమ్మెల్సీ బిటి నాయుడు, ఆదోని నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి మీనాక్షి నాయుడు, మాజీ ఇంఛార్జి గుడిసె కృష్ణమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నారా లోకేష్

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

- రాత్రి వేళల్లో విస్తృత తనిఖీలు : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో నేర నివారణే లక్ష్యమని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. నంద్యాల పట్టణంలో రాత్రి వేళ గస్తీ నిర్వహణకు పోలీస్ సిబ్బందికి 15 కొత్త హీరో గ్లామర్ టూ వీలర్ వాహనాలను ఎస్‌పి, ఎఎస్‌పిలు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నంద్యాల పట్టణ పరిధి జనాభా పెరిగిపోతుండడంతో ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించేందుకు, ప్రశాంతయుత వాతవరణం కల్పించే దిశగా నేర నివారణలో భాగంగా పట్టణంలో రాత్రి గస్తీని 4 సెక్టర్లుగా విభజించినట్లు చెప్పారు. అత్యవసరమైతే తప్ప అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరగకూడదని యువతను హెచ్చరించారు. ఇప్పటికే నంద్యాల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా శక్తి టీంకు 6 వాహనాలు, ఉమన్ హెల్ప్ డెస్క్‌కు 29 వాహనాలు, బ్లూ కోట్స్‌కు 58 వాహనాలు ఉన్నాయని తెలిపారు. వాటికి అదనంగా 15 కొత్త హీరో గ్లామర్ టూ వీలర్ వాహనాలను గస్తీ నిమిత్తం కేటాయించినట్లు చెప్పారు. పట్టణంలో రాత్రి గస్తీలో 4 సెక్టార్లలో 20 బ్లూ కోట్స్ వాహనాలు తిరుగుతాయని, వారిని ఇద్దరు ఎస్సైలు, ఒక సిఐ, ఒక డిఎస్పీ స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారని చెప్పారు. నంద్యాల పట్టణంలోని (1 టౌన్, 2 టౌన్, 3 టౌన్, తాలుకా పోలీసుస్టేషన్) ఆయా పోలీసుస్టేషన్‌ల పరిధులలో 20 రూట్ మొబైల్స్ గస్తీ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు, అక్రమాలు, అసాంఘిక కార్యకలపాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలోని రద్దీ, ప్రధాన, ముఖ్యమైన, సమస్యాత్మకమైన ప్రాంతాలలో పోలీసు అధికారులు నేర నివారణే లక్ష్యంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసి గట్టి నిఘాను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. నంద్యాల పట్టణంలోనే 239 సిసి కెమరాలు ఉండగా అందులో 62 బృహస్పతి, 117 మ్యాట్రిక్స్ సిసి కెమెరాలతో నిఘాను పటిష్టంగా ఉంచామన్నారు. 2023లో నంద్యాల నగరాన్ని పూర్తి సేఫ్‌గా మార్చేందుకు గట్టి చర్యలు చేపట్టామని తెలిపారు.


గస్తీ నిర్వహణకు వాహనాలను అందజేస్తున్న ఎస్‌పి, ఎఎస్‌పి

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం

- పాల్గొన్న మ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఆళ్లగడ్డ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి కొలిమిగుండ్ల

మండలంలోని తిమ్మనాయునిపేట గ్రామంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి శతావత్సవ కుంభాభిషేక మహోత్సవం ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సుధాకర్ శెట్టి, సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ సమిష్టిగా వున్నప్పుడే గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందుతాయని చెప్పారు. అలాగే ఆళ్లగడ్డ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ఐ రమేష్ రెడ్డి, తిమ్మనాయునిపేట నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


మహోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్, ఆళ్లగడ్డ డిఎస్‌పి తదితరులు

కుంభాభిషేక మహోత్సవంలో బిసి ఇందిరా రెడ్డి

తిమ్మనాయుని పేట గ్రామానికి చెందిన ఆర్యవైశ్యుల ఆహ్వానం మేరకు వాసవి కన్యకా పరమేశ్వరి శతసంవత్సర కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా రెడ్డి పాల్గొన్నారు. ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కోటపాడు శివరామిరెడ్డి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మహోత్సవాలలో పాల్గొన్న బిసి ఇందిరా

హాయి హాయిగా.. చల్లచల్లగా..

- జలకాలాటలలో చిన్నారులు..

ప్రజాశక్తి - పగిడ్యాల

రోజు రోజుకు ఉష్ణోగ్రత పెరిగిపోతుంది. ఇటు పట్టణాలలో అటు గ్రామీణ ప్రాంతాలలో భానుడు మండిపోతున్నాడు. ఉష్ణోగ్రత 43 డిగ్రీ వరకు నమోదు అవుతుండంతో ప్రజలు ఇండ్లలో నుంచి బయటకు రావడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బయటకు రావాలంటేనే ఎండ వేడికి బెంబెలెత్తిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పెద్ద పెద్ద చెట్ల కింద కూర్చుని ఎండ వేడిమి నుంచి కొంత ఉపశమనం పొందుతున్నారు. మూగజీవాలు పశుగ్రాసం కోసం పొలాల్లోకి వెళ్లి ఎండ వేడిమికి తట్టుకోలేక ఎక్కడ నీడ ఉంటే అక్కడ చెట్ల కిందకు, నీటి కుంటల్లోకి వెళ్లి సేదతీరుతున్నాయి. పిల్లలు బావులలో, కుంటలలో ఈత కొడుతూ సేద తీరుతున్నారు. ఒంటిపూట పాఠశాలలు ఉండడంతో మధ్యాహ్నం తర్వాత పిల్లలు ఈతకు వెల్లుతున్నారు. పాత ముచ్చుమర్రి గ్రామంలో రాయలసీమ పుష్కరఘాట్ సమీపాన నిర్మించిన దోబిఘాట్‌లో పిల్లలు నీటిలో జలకాలాడుతూ కేరింతలు ఒడుతున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక పిల్లలు పాఠశాలల నుంచి ఇంటి వచ్చిన వెంటనే నీటి కుంటల్లో ఈత కొడుతూ సేద తీరుతున్నారు.


జలకాలాడుతున్న చిన్నారులు

అహోబిలానికి పాదయాత్రగా ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - చాగలమర్రి

అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పాదయాత్ర చేపట్టారు. శుక్రవారం రాత్రి పులివెందులలో కుటుంబ సభ్యులు, మిత్రులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర ప్రారంభించారు. ఆదివారం రాత్రి కడప జిల్లా నెమళ్ళదిన్నె గ్రామం మీదుగా నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం రాంపల్లె, చిన్నబోధనం గ్రామాల వరకు పాదయాత్ర కొనసాగించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ముందు తాను గెలుపొందితే పాదయాత్ర ద్వారా మొక్కుబడి తీర్చుకుంటానని అనుకోవడంతో ఈ పాదయాత్ర చేస్తున్నట్లు ఎమ్మెల్సీ పేర్కొన్నారు. తిప్పనపల్లె, క్రిష్ణాపురం, బాచెపల్లె మీదుగా ఆహెూబిళం చేరుకొని లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని పాదయాత్ర ముగుస్తుందన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు నరసింహారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, బయ్యపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాంపల్లె వద్ద పాదయాత్రగా వస్తున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - డోన్

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని డోన్ పట్టణంలోనిపాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పాఠశాలలో హెచ్‌ఎం అధ్యక్షతన విద్యార్థులకు పుస్తక పఠనం వలన కలిగే లాభాల గురించి వివరించారు. ఈ సందర్భంగా చిరిగిన చొక్కానైనా తొడుక్కో, కాని ఒక మంచి పుస్తకం కొనుక్కో అన్న కందుకూరి వీరేశలింగం మాటలను గుర్తు చేశారు. మనోవికాసానికి మార్గదర్శి పుస్తకమని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వెంకటేశ్వర్ గౌడ్, వెంకటలక్ష్మీ, లక్ష్మయ్య, రాఘవేంద్ర, దేవేంద్రప్ప, శ్రీనివాసులు, భూ కాంతరెడ్డి, మద్దిలేటి, సుబ్బారాయుడు, మధుసూదన్ రెడ్డి, జయ సుబ్బా రాయుడు, భాను ప్రకాష్ రెడ్డి, భారతి, లక్ష్మి ప్రభావతి, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : పుస్తకం అందరికీ మంచి నేస్తం అని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి అన్నారు. ఆదివారం మండలంలోని పలుకూరు గ్రామంలో జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానందచారి ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకొని పుస్తకం విశిష్టతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ముందుగా పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుస్తకం అమ్మలా లాలిస్తుందని, నాన్నల ఆదరిస్తుందని, గురువుల బోధన చేస్తుందని తెలిపారు. ఒంటరితనంలో స్నేహితునిలా అక్కున చేర్చుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో బాల సరస్వతి భజన మండలి అధ్యక్షుడు బాల హనుమంతు, శ్రీనివాసులు, భాష, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తక పఠనాన్ని గురించి విద్యార్థులకు వివరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటసుబ్బారెడ్డి

ఉత్సవాలను విజయవంతం చేద్దాం : టిడిపి

ప్రజాశక్తి - గడివేముల

గడివేముల మండలం దుర్వేసి గ్రామంలో మే నెలలో జరిగే చేన్న కేశవ స్వామి ఉత్సవాలను అందరం కలిసి విజయవంతం చేయాలని టిడిపి బిసి సెల్ పాణ్యం నియోజకవర్గ అధ్యక్షులు అంగజాల కృష్ణ యాదవ్ కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ దుర్వేసి గ్రామంలో జరిగే చెన్నకేశవ స్వామి ఉత్సవాలకు గ్రామంలోని అందరినీ కలుపుకొని నిర్వహిస్తామన్నారు. గ్రామానికి చెందిన శంకర్ రెడ్డి, రెడ్డి గ్రూపునకు చెందిన కొందరు, వాల్మీకి కుటుంబాలు, తన అనుచరులతో గ్రామంలో జరిగే చెన్నకేశవ ఉత్సవాలను కేవలం కక్ష సాధింపుల కొరకే నిర్వహిస్తున్నారని అన్నారు. రెడ్డి, వాల్మీకి చెందిన వారితోనే చందాలు వసూలు చేసి నిర్వహిస్తామనడం దారుణమన్నారు. గ్రామంలో పూర్వం నుంచి వస్తున్న ఆచారాలను పక్కనపెట్టి నిర్వహించడం సరైనది కాదని అన్నారు. గ్రామంలో 80 కుటుంబాల యాదవ సోదరులు ఉన్నారని, ఇందులో 10 కుటుంబాలను విడదీసి యాదవ కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో జరిగే చెన్నకేశవ స్వామి ఉత్సవాలకు యాదవ సంఘం వారు 11 గొర్రెలను బలి కోసం ఇచ్చేవారని, పూర్వకాలం నుంచి గ్రామంలో ఉన్న యాదవులను పక్కనపెట్టి కొత్తగా గ్రామానికి వచ్చిన యాదవుల దగ్గర నుండి గొర్రె పిల్లలను తీసుకోవడం సరైనది కాదన్నారు. గ్రామంలో జరిగే ఉత్సవాలకు అన్ని కులాలకు చెందిన వారిని పెద్ద మనుషులుగా ఎన్నుకొని నిర్వహిస్తే బాగుంటుందని తెలిపారు. గ్రామంలో పట్టింపులకు పోకుండా అందరిని కలుపుకు పోవాలని అన్నారు. దుర్వేసి గ్రామం ఫ్యాక్షన్ కావడంతో రాజకీయాలకు సంబంధం లేకుండా ఈ ఉత్సవాలు నిర్వహించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. గ్రామంలో ఫ్యాక్షన్‌తో 13 మంది దారుణ హత్యకు గురయ్యారని, ముగ్గురు దాడికి గురయ్యారని, 2003లో అప్పటి సర్పంచ్ బాలరాజు, మా తమ్ముడైన ఉప సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ గ్రామ పెద్దల కోరిక మేరకు గ్రామ పెద్దగా ఉండి చెన్నకేశవ స్వామి ఉత్సవాలను విజయవంతం చేశారని తెలిపారు. మే నెలలో జరిగే చెన్నకేశవ స్వామి ఉత్సవాలకు యాదవ కులంలో రెండు వర్గాలుగా చీల్చి రాజకీయం చేయడం సరైనది కాదన్నారు. గ్రామానికి చెందిన అన్ని కులాలకు కలుపుకుపోయి జాతర విజయవంతం చేయాలని తాము కోరుతున్నామన్నారు.



మాట్లాడుతున్న టిడిపి బిసి సెల్ పాణ్యం నియోజకవర్గ అధ్యక్షులు అంగజాల కృష్ణ యాదవ్


మాట్లాడుతున్న జెవివి నాయకులు

తొలగించిన పాఠ్యాంశాలను తిరిగి చేర్చాలి : జెవివి

ప్రజాశక్తి - నంద్యాల : పాఠశాల సిలబస్‌లో ఎన్సీఈఆర్టీ తొలగించిన పాఠ్యాంశాలను తిరిగి చేర్చాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ టి.నాగరాజు తెలిపారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా స్థానిక భగత్ సింగ్ గ్రంథాలయంలో జెవివి జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈ విద్యా సంవత్సరం నుంచి 2023-2024 విద్యార్థులపై భారం తగ్గించే పేరిట హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా ఎన్‌సిఈఆర్‌టి గణిత విషయంలో రెండు సంఖ్యల గాసాభ సదిశ బీజ గణితం అధ్యాయాలను, సైన్స్ సబ్జెక్టులో డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని, సహజ ప్రత్యుత్పత్తి వ్యవస్థలను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి మాట్లాడుతూ ఈ చాప్టర్లో తొలగింపు వల్ల విద్యార్థులకు విషయ అవగాహన రాహిత్యమని, జేఈఈ, నీట్ వంటి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. సోషల్ సబ్జెక్టులో కూడా మొగల్ శకం, గాంధీజీ హత్య, పరిణామాలు తదితర పాఠ్యభాగాలను కత్తిరించడం చరిత్రను వక్రీకరించడమని విమర్శించారు. తొలగించిన అన్ని పాఠ్యాంశాలను చేర్చాలని డిమాండ్ చేశారు. జెవివి పట్టణ కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పుస్తక పఠన ఆవశ్యకత, రాష్ట్ర విద్యాశాఖ నిర్వహిస్తున్న వి లవ్ రీడింగ్ చాలా ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. కార్యక్రమంలో రామరాజు, ఎస్.వెంకట రమణ, పి.పునీత్, ఎస్.కాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రచార భేరి ముగింపు సభను జయప్రదం చేయండి : సిపిఎం, సిపిఐ

ప్రజాశక్తి - ఆత్మకూర్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలపై చేపట్టిన సిపిఎం, సిపిఐ ప్రచారభేరి కార్యక్రమం ముగింపు సందర్భంగా ఈ నెల 25 మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆత్మకూరు పట్టణంలోని గౌడ్ సెంటర్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ తాలూకా కార్యదర్శి కె.శ్రీనివాసులు, సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్‌లు కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఏసు రత్నం, సీనియర్ నాయకులు ఏ.రాజశేఖర్ తదితరులు హాజరవుతారని చెప్పారు. కావున పట్టణ ప్రజలు, మేధావులు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, ప్రతి ఒక్కరు ఈ బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు మాభాష సి.వెంకటేశ్వర్లు, డి.రాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవస్థానానికి విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి దేవస్థానానికి ఆదివారం రూ 25 వేలు విరాళం భక్తులు అందజేశారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామానికి చెందిన నామాల వెంకటసుబ్బయ్య, భార్య ఈశ్వరమ్మలు ఆలయ అభివృద్ధికి రూ.25 వేల నగదును మాజీ చైర్మన్ పి.ఆర్ వెంకటేశ్వర రెడ్డి, అర్చకులకు అందజేశారు.

సిపిఎం కార్యకర్త ఏసన్న మృతి

ప్రజాశక్తి - ఆత్మకూరు : ఆత్మకూరు మండలం కొత్త రామాపురం గ్రామానికి చెందిన సిపిఎం కార్యకర్త ఏసన్న అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలిసిన సిపిఎం మండల కార్యదర్శి నరసింహ నాయక్, పి.సుధాకర్, నాగమ్మ, చెన్నమ్మలు గ్రామానికి వెళ్లి ఏసన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసన్న సిపిఎంలో 1995 నుండి 2010 వరకు పార్టీ సభ్యుడిగా ఉంటూ, కొత్త రామాపురం గ్రామంలో ప్రజల పక్షాన ఉంటూ దేవదాయ భూములు పేదలకు పంచాలని నిర్వహించిన పోరాటంలో చురుకుగా పాల్గొన్నారని చెప్పారు. ఏసన్న కుటుంబానికి సిపిఎం మండల కమిటీగా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బాధిత కుటుంబానికి మంత్రి తనయుడు పరామర్శ

ప్రజాశక్తి - బేతంచర్ల : బేతంచర్ల పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన మాభాష కుమారుడు చిన్న పాశంవలిని ఇటీవల వీధి కుక్క కరవడంతో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. విషయం తెలిసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు అర్జున్ రెడ్డి బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా నిచ్చారు. రంగనాయుడు, కోడే వెంకటేశ్వర్లు, తిరుమలేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ నిరంజన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె : యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి థాయ్ బాక్సింగ్ రాష్ట్ర చైర్మన్ బీసీ ఇందిరా పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మండలంలోని రాళ్లకొత్తూరు గ్రామానికి చెందిన యువకులు వేసవిలో ఆటలు ఆడుకునేందుకు క్రీడా సామాగ్రి కావాలని అడగడంతో ఆమె క్రికెట్ కిట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత వేసవికాలంలో చెడు వ్యసనాలకు లోను కాకుండా క్రీడలపై దీష్టి సారించాలన్నారు.

3 నుండి చెన్నకేశవ స్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి - అవుకు : అవుకు పట్టణంలో వెలసిన భూలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి తిరుణాల మహోత్సవాలు మే 3 నుండి ప్రారంభమవుతాయని ఎంపిపి చల్లా రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మహోత్సవాల ఏర్పాట్లపై ఆదివారం సాయంత్రం గ్రామ పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో అవుకు మండలాధ్యక్షుడు చల్లా రాజశేఖర్ రెడ్డి, దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి పెద్ద కుమారుడు చల్లా విగ్నేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి ఆశయాలకు అనుగుణంగా, అవుకు పట్టణంలో జరిగే శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి తిరుణాల మహోత్సవాలకు చల్లా కుటుంబం అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు. ఆలయ అభివీద్ధి, చెన్నకేశవ స్వామి రథోత్సవాన్ని వచ్చే సంవత్సరం కంతా మా సొంత నిధులతో నూతనంగా తయారు చేయిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా గ్రామ అభివృద్ధి కోసం మా కుటుంబం ఎల్లవేళలా అందుబాటులో ఉండి పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచి దగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వివిధ సంఘాల అధ్యక్షులు కార్యదర్శులు, సభ్యులు, గ్రామ పెద్దలు, రైతు సంఘం పెద్దలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి చల్లా రాజశేఖర్ రెడ్డి